**సిపిఐ(యం) ది. 2.11.2020 ప్రెస్‌మీట్ నోట్**

రాష్ట్రానికి ద్రోహం చేసిన 'బిజెపితో వైసిపి, టిడిపి రాజీ ఎందుకు ?' బుక్‌లెట్‌ను సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు సోమవారం ఎంబి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన, చేస్తున్న ద్రోహం, తాజాగా పోలవరం నిధులకు గండికొట్టడం వంటి చర్యలను ప్రజల్లో ఎండగట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7 నుండి 15 వరకు సిపిఎం రాజకీయ ప్రచారం చేయనున్నట్లు ప్రకటించారు. కేంద్రంలోని బిజెపి పార్లమెంటు చేసిన తీర్మానాలకు విలువ లేకుండా చేస్తోందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం తెలిపిందని, విభజన హామీలు, ప్రత్యేక హెూదా, దుగరాజపట్నం పోర్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వేజోన్, రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణం బాధ్యతలన్నిటి నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుని రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందని ఆగ్రహించారు. పోలవరం ప్రాజెక్టుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నిర్మాణం మొత్తం వ్యయాన్ని కేంద్రమే భరిస్తామని 2018 అంచనాల్లో అంగీకరించి, నేడు మాటమార్చి కేవలం రూ.20 వేల కోట్లు మాత్రమే ఇస్తామని చెప్పి.. పార్లమెంటులో చేసిన హామీలకు బిజెపి తూట్లు పొడుస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టు అంశంపై సిఎం అఖిలపక్ష సమావేశాన్ని తక్షణమే నిర్వహించి, ప్రజల, అన్ని రాజకీయ పార్టీల మద్దతును సమీకరించాలని, నిధులను సాధించేందుకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేయాలని పి.మధు కోరారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారాన్ని చెల్లించకుండా ప్రాజెక్టు పూర్తవడం సాధ్యం కాదని తెలిపారు. ప్రస్తుతం అప్పుల్లో మునిగి ఉన్న రాష్ట్రం పోలవరాన్ని సొంత డబ్బులతో పూర్తిచేయడం అసాధ్యమన్నారు. ఈ క్రమంలో రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్రాన్ని.. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు పోటీపడి బలపర్చడం రాష్ట్రానికి అన్యాయం చేయడమేనని, ఆ పార్టీలు తమ వైఖరిపై పునరాలోచించుకోవాలని సూచించారు. రైతు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను చేస్తున్న కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలను మోపుతోందన్నారు. మత సామరస్యంతో ఉన్న రాష్ట్రంలో మత చిచ్చు రేపేందుకు బిజెపి కుట్రలు పన్నుతోందని, వీటిని ప్రజల్లో ఎండగట్టాలని తెలిపారు. ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి చర్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే రాజకీయ ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నామని పి.మధు తెలిపారు.